# పరిణామం

శ్రీ వసంతరావు రామకృష్ణరావు

నలువైపులా చీకట్లు ఆవరిస్తున్నాయి-అక్కడక్కడ దీపాలు కొద్దిగా వెలుగుతున్నాయి—జన సమ్మర్దము ఎక్కువైంది—బజారు పూర్తిగా మనుష్యులతో నిండిపోయింది. ఆమె, సరాసరి ఆ భవనం చేరుకుంది. ఆమె ఏకాకి—అదొక పెద్దభవనం—భవన ప్రాంగణంలో రకరకాల పుష్పాలు-పరిమళాన్ని వెదజల్లుతున్నాయి.

ఆ గృహసేవకుడు ఆమెను చూడగానే లోపలకు దారియిచ్చి, వంగి సలాము చేసాడు. ఆమె నిరభ్యంతరంగా లోనికి ప్రవేశించింది.

ఆమె జీవిత పరిణామం ఇప్పుడు వింత భావాన్ని చూపుతూంది. అంతకు పూర్వం ఆ విశాల భవనానికి అంతటికీ ఆమె అధికారిణి—తన అధికారం క్రింద గృహ యజమాని కూడా కొన్నాళ్ళు లోబడి ఉన్న సంగతి గృహసేవకుడికి బాగా జ్ఞప్తి ఉంది.

అయితే—అవన్నీ గతించినరోజులు—ఆమె హృదయంలోని ఆశలు ఆకులకు మల్లే రాలిపోయాయి—ఆమె ప్రణయ కుసుమం పరిమళాన్ని వెదజల్లకుండానే నిర్గంధమై పోయింది.

పాపం, ఆఖరు క్షణంలో కూడా మగువకున్న ధైర్యం ఆ మగవాడికి లేకపోయింది. అతడు సంస్కృతిని ఆశించలేకపోయాడు. సంఘతత్వాన్ని నిగ్రహించలేక పోయాడు. అతడు మాత్రం ఏం చేస్తాడు? అధిగమించలేని దౌర్బల్యతకు లోబడ్డాడు...

ఫలితం ఆమె జీవితమంతా నిరాశా పూరితమైంది—ఆమె సౌందర్యం అడవిని కాచినవెన్నెల ఇవి ఆమెలో హృదయ భేదన ఖేదాన్ని కలిగిస్తున్నాయి. తన జీవితం ఆమెకు బరువుగాతోచింది-తన స్థితినిచూసి అసహ్యించుకుని విచారించింది.

అతడిలో మార్పువచ్చింది—క్షమాభిక్షను వేడుకున్నాడు—అయితే సమయం మించిపోయింది—పరిస్థితి విషమించింది.

జైలునుండి విడుదలై వచ్చిన ఆమెను చూడగానే అతని కళ్ళనుండి అశ్రువులు రాలినాయ్-మరొకసారి తిరిగి క్షమించమని దీనంగాకోరాడు. కాని మాట నిలుకడలేని మనిషిని తాను ఎట్లా విశ్వసిస్తుంది? అతను చేసిన తప్పు క్షమార్హమైనది కాదు.

అతని హృదయంలో ఏదో బాధ-తనుచేసిన తప్పుకి హృదయం బ్రద్దలైనంత దుఃఖం ఆవహించింది—ఆవేదనతో నేలకొరిగాడు—ఆమె అతడ్ని తన హస్తాలమీద ఆనించి సోఫామీద పరుండబెట్టింది.

ఆమె నయనాలనుండి రాలుతున్న అశ్రుబిందువులు తుడిచికొంటూ ఆమె లేచింది—అతను చేసిన ద్రోహం తన జీవితాన్నే నాశనం చేసింది—ఆమె అక్కడ ఒక్క నిమిషం నిలబడలేక పోయింది.

ఆకాశంలోని తారలకు ఆకారం లేదు—మేఘాలు అధికారం చలాయిస్తున్నాయ్-అంతా కటిక కాటుక చీకటి-గాలి తాకుడికి తాటాకులు గలగలమంటూన్న వింతశబ్దం—

గేటుతలుపు తీసికొని ఆమె చీకటిలో లీన మైంది—సేవకుడు నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ఆమె ఎటువెళ్లిందో ఎవరికి తెలుస్తుంది?

ఆ భవనంలో గాలివేగానికి అద్దాలతలుపులు చప్పుడు—గడియారం కొట్టిన చీకటిగంటల ఘంటాశబ్దం అతడిని మేలుకొలుపాయి నలు వైపులూ చూసాడు—గదిలో దీపం గాలికి కదులుతూ ఉంది—ఆమె అక్కడ ఉన్నజాడలు కూడా లేవు—బయటికు వచ్చాడు—గేటుతలుపు తీసివుంది. సేవకుణ్ణి అమ్మ ఎటువెళ్ళింది? అని ఆత్రంగా ప్రశ్నించాడు-ఇప్పుడే ఇట్లా వెళ్లారు అన్నాడు సేవకుడు సగం నిద్రావస్థలో—

అతడు ఆ చీకట్లోనే గబగబా నడిచివెళ్లాడు-దిక్కులన్నీ బిక్కుమంటున్నాయ్—క్షణంలో అతని ముఖంగంభీరమైంది—నిర్మలమైంది-చీకట్లో నీట్లో మునిగిన చప్పుడు-తిరిగి అంతా నిశ్శబ్దం—సేవకుడు లైటు వెలిగించాడు—యజమాని గోదావరి నదిలో అపుపించలేదు—నదిలో చెట్టు కొమ్మ కొట్టుకుపోతూ ఉంది.

ఆమె తిరిగి పోలీసులకు దొరికింది—ఆమె జీవితం జైలు కటకటాల వెనుక—ఆ రాత్రి ఆమె ప్రశాంతంగా శూన్యంలోకి చూస్తూ ఇనుప ఊచలు ఆనుకుని నిల్చుని ఉంది—

దిక్కులన్నీ గంభీరం—ప్రకృతి అంతా ప్రశాంతం-అతని మరణం ఆమెకు తెలియని విషయం-ఆమె జీవితం జైలుజీవితం అని ఆమెకు తెలిసింది—


# పెళ్లికట్నం

కట్నం అనేది సంఘంలో తరతరాలుగాకాదు, శతాబ్దాల తరబడిని సంఘంలో వ్యాపించియున్న ఘోర దురాచారం. ఈ దురాచార సమస్య యే విధంగా మహోపద్రవంగా పరిణమించి, ప్రుంగదీసి వేలాది కుటుంబీకులను కూలవేస్తున్నది విపులంగా, సోదాహరణంగా మనోజ్ఞంగా వివరించే చిన్న గ్రంథమే యీ "పెళ్ళికట్నం!" దీని వెల 0—4—0.

★

విడిప్రతి కావలసినవారు 0-5-0 తపాలా బిళ్ళలు పంపితే పుస్తకం బుక్‌పోస్టులో పంపిస్తాం.

కథాంజలి కార్యాలయం

**32, క్రిష్ణప్పనాయక్ టాంక్‌వీధి, జి. టి. మదరాసు.**